# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 226 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం, 19 జులై 2026 | పేజీలు :4




శోభాయమానంగా బాణాపురం ఆలయ తృతీయ పుష్కర వేడుకలు

2



## పారదర్శకంగా పరీక్షల నిర్వహణ

### పరిశీలించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ, మన చౌరాస్తా :** విద్యా సంవత్సరం 2026-27కు జనగామ జిల్లాలో ప్రభుత్వం మంజూరు చేసిన 39 నూతన ప్రీప్రైమరీ పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి సంబంధించి శనివారం కలెక్టరెట్ లో నిర్వహించిన వ్రాతపరీక్షలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తయ్యాయి. ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు హ్యాబిటేషన్ (స్థానిక) పరిధిలోని అభ్యర్థుల నుండి మొత్తం 269 దరఖాస్తులు అందగా, వారిలో 254 మంది వ్రాతపరీక్షకు హాజరయ్యారు. 15 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా, ఆయా పోస్టులకు 152 మంది స్థానిక అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.... వారిలో 139 మంది పరీక్షకు హాజరయ్యారు. 13 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు ఒక గంటన్నర , ఆయా పోస్టులకు గంటన్నర వ్యవధిలో వ్రాతపరీక్ష నిర్వహించారు. పరీక్షలను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించారు. ఈ మొత్తం ప్రక్రియను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, జీసీడిఓ గౌస్యా బేగం, ఏసీజీఈ , డీసీఈబి సెక్రటరీ, కేజీబీవీల అకౌంటెంట్లు, ఉపాధ్యాయులు, ఇన్‌స్ట్రక్టర్లు, ఇతర విద్యాశాఖ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి పరీక్షలను విజయవంతంగా పూర్తి చేశారు.

## రేపటి గ్రీవెన్స్ రద్దు

ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 20న జరిగే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం హనుమకొండలో మంత్రివర్యుల సమావేశం ఉన్నందున గ్రీవెన్స్ ని రద్దు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయం గమనించాలని కోరారు.






## శోభాయమానంగా బాణాపురం ఆలయ

# తృతీయ పుష్కర వేడుకలు

**త్రిదండి చిన్న జీయర్ స్వామికి ఘనంగా స్వాగతం పలికిన భక్తులు**

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా కేంద్రం బాణాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం తృతీయ పుష్కర వేడుకలు శనివారం సాయంత్రం శోభాయమానంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 4.30 గంటలకు జనగామ పట్టణం చేరుకున్న శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి కి భక్తులు, మున్సిపల్ చైర్ పర్సన్ కడకంచి బలమని శ్రీనివాస్ తో పాటు పలువురు పుర ప్రముఖులు పాల్గొని ఘనంగా స్వాగతం పలికి డప్పు చప్పుళ్ళు, డోల్ల విన్యాసాలు, మహిళల కోలాట నృత్యాలతో చౌరస్తా నుండి దేవాలయం వరకు శోభా యాత్ర నిర్వహించారు. శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణ లో జరుగుతున్న తృతీయ పుష్కర వేడుకలకు బ్రహ్మగా శ్రీమాను తిరుమల నల్లాను చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి, యజ్ఞాచార్యగా శ్రీమాను మధుస్యామ సంపత్కుమార్ వ్యవహరిస్తున్నారు. కాగా వేదపండితులు చక్రవర్తి, రామాంజన్, కృష్ణమాచార్య, తిరువేంగలాచార్య, హేమంత్, జగన్నాథ స్వామి, గోవిందాచార్య, సింగర గురు అయ్యంగార్, రాఘవయ్య, వీరరాఘవన్, కళ్యాణ్, విష్ణు, ప్రసన్నాచార్య, ఆదిత్య శ్రీనివాసాచార్య ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.







# కేటీఆర్ వ్యాఖ్యలు నిరూపించాలి

- **గాజులు వేసుకొని చౌరస్తాలో కూర్చుంటా**
- **కాంగ్రెస్ నాయకుడు పచ్చునూరి కరుణాకర్**

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పచ్చునూరి కరుణాకర్ విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి కేటీఆర్ చేసిన ఉద్యోగాలపై వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో లక్షా అరవై వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించినట్లు కేటీఆర్ నిరూపిస్తే తాను ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద గాజులు వేసుకొని కూర్చుంటానని సవాల్ విసిరారు. నిరాధార ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ముప్పై నెలలు పూర్తవుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా మరియు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో ఇప్పటికే సుమారు 80 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ఉద్యోగాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్ రావు, కవిత తదితరులు ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తొమ్మిదేళ్ల పాలనలో నిరుద్యోగులకు తగిన న్యాయం చేయలేదని, విశ్వవిద్యాలయాల్లో నిరుద్యోగ యువత దీర్ఘకాలం ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసి నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పిస్తోందని, బీఆర్ఎస్ నాయకులు వాస్తవాలను వక్రీకరించి మాట్లాడడం మానుకోవాలని పచ్చునూరి కరుణాకర్ హెచ్చరించారు.




# ముదిరాజ్ నాయకుడి ముందస్తు అరెస్ట్

**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** హలో ముదిరాజ్ - చలో హైదరాబాద్' మత్స్యశాఖ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా ముదిరాజ్ సంఘం జనగామ జిల్లా నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. శనివారం లింగాలఘణపురం పోలీసులు ముదిరాజ్ జనగామ జిల్లా నాయకుడు ఊదరి సతీష్ ముదిరాజ్ ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అరెస్ట్ అయిన సతీష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల న్యాయమైన డిమాండ్ల కోసం తాము చేపట్టిన శాంతియుత కార్యక్రమాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని మండిపడ్డారు. ప్రభుత్వాలు ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను ఎప్పటికీ ఆపలేవని వారు స్పష్టం చేశారు. మత్స్యకారుల హక్కుల సాధన, ముదిరాజ్ సమాజ సంక్షేమమే ధ్యేయంగా తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని హెచ్చరించారు.

## దూప దీప నైవేద్య అర్చకుల నూతన కమిటీ ఎన్నిక



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండల కేంద్రంలోని శ్రీ భీమేశ్వర ఆలయంలో శనివారం దూప దీప నైవేద్య అర్చకుల మండల స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు గణేష్ సిద్ధాంతి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బూరుగుపల్లి అఖిల్ సాయిశర్మ, ఉపాధ్యక్షుడిగా గుడికందుల రమేషాచారి, కార్యదర్శిగా గుండ్ల శ్రీరామ శర్మ, కోశాధికారిగా అనుముల ప్రవీణ్ శర్మ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కొండ్ర హరీష్, తిముగుల సదాశివశర్మ, శ్రీరామ శర్మ, ఉప్పల కోటిచారి తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులకు సమావేశంలో పాల్గొన్న అర్చకులు అభినందనలు తెలియజేసి, సంఘ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.




# బెల్ట్ షాపులను తొలగించాలి

**ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు బీఆర్ఎస్ యువజన నాయకుల వినతి**

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలోని 17వ వార్డులో కొనసాగుతున్న బెల్ట్ షాపులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ 17వ వార్డు బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా యువజన నాయకులు బిఆర్ఎస్ యువజన నాయకులు చిగురు నవీన్, మార్కా ప్రవీణ్, శిరసాగర్ నవీన్, మూషం బాలకృష్ణ, దేవనూరి సాయి, మూదం అభి, ఉడుగుల సాగర్ మాట్లాడుతూ నివాస ప్రాంతాలు, విద్యాసంస్థలకు సమీపంలో బెల్ట్ షాపులు ఉండటం వల్ల ప్రజలు, ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి ఉందన్నారు. ప్రజా ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆ బెల్ట్ షాపులను తొలగించాలని వారు కోరారు. లేనిపక్షంలో సమస్య పరిష్కారం అయ్యేవరకు ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



# మహిళల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం

## వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**పాలకుర్తి వాణి, హైదరాబాద్ :** మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబనకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. హైదరాబాద్, రెడ్ హిల్స్ లో తెలంగాణ ఎస్సీ/ఎస్టీ ఇండస్ట్రియల్ చాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎస్ఐసీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన రైజ్ హర్-26 మహిళా సాధికారత సదస్సు కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ మహిళల సంక్షేమం, సాధికారత, ఆర్థిక స్వావలంబనకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళలు ఎల్లప్పుడూ పాజిటివ్ ఎనర్జీతో ముందుకు సాగాలని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి "పే బ్యాక్ టూ సొసైటీని ప్రతి ఒక్కరిని అలవర్చుకోవాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షిస్తూ జాతీయ గౌరవాన్ని పెంపొందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (TGIIC) చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఇండస్ట్రియల్ కామర్స్ డిపార్ట్మెంట్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్ నాయక్, PMEGP రవి, SBI లీడ్ డిస్టిక్ మేనేజర్ మూర్తి,వి హబ్ డైరెక్టర్ జావేద్ అక్తర్ షేక్ ,TSICC ప్రెసిడెంట్ నల్ల బాబు తదితరులు పాల్గొన్నారు..



# వల్మీడిలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పర్యటన

**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ వల్మీడి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయంలో నిర్మించనున్న కళ్యాణ మండపం కోసం పాలకుర్తి శాసనసభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి స్థల పరిశీలన నిర్వహించారు. ఇటీవల ఆలయంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న సందర్భంగా, దేవాలయ అభివృద్ధిలో భాగంగా రూ.50 లక్షల వ్యయంతో ఆధునిక సౌకర్యాలతో కూడిన కళ్యాణ మండపాన్ని నిర్మిస్తానని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హామీ ఇచ్చారు. ఆ హామీ అమలులో భాగంగానే శనివారం అధికారులతో కలిసి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించి, నిర్మాణానికి అనువైన ప్రదేశంపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. శ్రీ వల్మీడి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిందని, ఆలయానికి వచ్చే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. కళ్యాణ మండపం నిర్మాణం పూర్తయితే ఆలయంలో జరిగే ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు భక్తులకు వివిధ సేవలు అందించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి



ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**విద్యార్థినులకు యూనిఫాంల పంపిణీ**

పాలకుర్తి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థినులకు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి యూనిఫాంలు, విద్యకు అవసరమైన పలు వస్తువులను పంపిణీ చేశారు.






## 'నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం

# అవిశ్రాంత పోరాటం'

**జనగామ, మన చౌరాస్తా :** హైదరాబాద్ సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'యువ సంగ్రామ సదస్సు'లో జనగామ నియోజకవర్గ బీఆర్ఎస్ యువజన నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన నిరుద్యోగం, ఉద్యోగాల కల్పన మరియు యువత హక్కుల పరిరక్షణపై పార్టీ చేపట్టిన పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.కార్యక్రమ ముఖ్యాంశాలు : ఈ కార్యక్రమంలో జనగామ పట్టణ బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ ఉల్లెంగుల సందీప్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు తిరుమల్ రెడ్డి, యువజన నాయకులు సురేష్ గౌడ్, శ్రవణ్, టౌకిర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.రాష్ట్రంలోని నిరుద్యోగ యువత పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో మరియు వారికి అండగా నిలవడంలో బీఆర్ఎస్ పార్టీ ముందుంటుందని నాయకులు స్పష్టం చేశారు.యువశక్తిని సంఘటితం చేసి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు పేర్కొన్నారు.పార్టీ అధినేత నిర్దేశించిన కార్యాచరణను జనగామ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి, యువతను భాగస్వామ్యం చేస్తామని తెలిపారు.ఈ సదస్సులో జనగామ నియోజకవర్గానికి చెందిన పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు యువజన ప్రతినిధులు పాల్గొని, పార్టీ పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు.



## బమ్మెరలో ఘనంగా కవి అందెశ్రీ

# జయంతి వేడుకలు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** జనగాం జిల్లా పాలకుర్తి మండలంలోని బమ్మెర గ్రామంలో పోతన సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో శనివారం కవి తెలంగాణ రాష్ట్ర గీత రచయిత ప్రకృతికవి ప్రజల కవి అంద 61వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.అందెశ్రీ జయంతి వేడుకల సందర్భంగా పోతన సాహిత్య కళావేదిక అధ్యక్షులు కార్యదర్శి ప్రముఖులు హాజరై అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా పోతన సాహిత్య కళావేదిక అధ్యక్షులు మాన్యపు బుజేందర్ మాట్లాడుతూ పోతన సాహిత్య వేదిక గత కొన్ని సంవత్సరాలుగా దివంగత కవుల జయంతులు& వర్ధంతులు నిర్వహిస్తుందని అందులో భావంగానే అందెశ్రీ జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అందే ఎల్లయ్య అందెశ్రీగా తెలంగాణలో పేరుగాంచారని తెలంగాణ రాష్ట్ర గీతం రచించిన గొప్ప కవి అని పకృతిని ఆరాధించే కవిగా తెలంగాణ కోసం ఎంతో పరితపించి ఎన్నో అభ్యుదయ గీతాలను రాసిన గొప్ప కవి అందెశ్రీ అని కొనియాడారు. కోట్లాది తెలంగాణ గొంతుల్లో జయ జయహే తెలంగాణ గీతమై ఎప్పటికీ నీవు ప్రతిధ్వనిస్తూనే ఉంటావు ప్రజల కవి అందెశ్రీ అని కొనియాడారు ఈ కార్యక్రమంలో పోతన సాహిత్య కళావేదిక కార్యదర్శి దేవసాని ఉపేందర్, సిపిఎం మండల నాయకులు సోమసత్యం ,తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ లకావత్ రాములు, పోతన సేవకుడు దేవసాని నరేష్, దొంతర బోయిన అశోక్, జిట్ట బోయిన ఎల్లయ్య, మారం రాకేష్, మాదరాజు అశోక్, కల్లెం నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

# wanted

## విలేకరులు కావలెను




మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సప్రదించగలరు.

**manachourasta@gmail.com**

**8555800812** **9676400812**

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**